# మాగబోయిన ముసల్ది


రామసహాయం నిర్మలారెడ్డి

'ఊరన్నమాటే గానీ... ఒక్క చెట్టుకూడా లేకుండా పోయింది. కరువొచ్చి కనపడిన చెట్టునల్లా కొట్టి అమ్ముకుంటున్నారు.... ఇంక గాలేడ ఆడుద్ది...' మధ్యాహ్నం ఉక్కపోతను భరించలేక నాలో నేనే అనుకున్నా...

సాయంకాలం కాస్త చల్లగాలికి రిలాక్స్ అవుదామని మిద్దెక్కా.

''ఆయమ్మకు, ఈయమ్మకు తాకట్లు పెట్టి కొంపమీదికి తేకపోతే కిష్టారామా అనుకుంటూ ఇంట్లో ఓ మూల కుసోరాదూ!'' పక్కింట్లో నుంచి గట్టిగా వినపడుతున్నాయి మాటలు.

ఏంటా అని కుతూహలంగా వాళ్లింట్లోకి తొంగి చూశా.



''ఇగో ఇంకోసారి గనక ఆళ్లింటికీ, ఈళ్లింటికీ వెళ్లి సాడీలు చెప్పావో... ఏం జేస్తానో నాకే తెలియదు'' అంటూ తల్లిపై కేకలేస్తున్నాడు చినతాతయ్య కొడుకు.

మిద్దెక్కితే చాలు ఆ ఇంట్లో, యీ ఇంట్లో ఎవరెవరు ఏం మాట్లాడుకున్నా స్పష్టంగా వినపడుతుంది, కనపడుతుంది. ముత్తాతల కాలంనాటి పెద్దింటిని రెండు భాగాలుగా పంచేసుకున్నారట మా తాతలిద్దరు. కాకపోతే వాళ్లు నేను పుట్టక ముందే కాలం చేసారు. వాళ్లింటికి, మా యింటికి మధ్య ఓ గోడమాత్రమే అడ్డుంటుంది. అటువైపు, ఇటువైపు అంతా ఖాళీస్థలం. ఈ గోడ మీద కూర్చుని అటువాళ్లతోనూ, ఇ వాళ్లతోనూ ఏక కాలంలో మాట్లాడేసెయ్యొచ్చు. మా నాయినమ్మ బతికున్న రోజుల్లో గోడ ఇ తలనించి ఈవిడ, అవతలనుంచి మా చినతా య్య భార్య తెగ అరుచుకుంటూ గొడవ పెట్టుకునేవారట. తోడికోడళ్లకు ఒక్క క్షణం కూడా పడకపోవడంతో ఇదో ఉప్పు అంటే అదో నిప్పు అనేట్టుగా ఉండేవారట. వీళ్ల గొడవ రోజురోజుకు పెరుగుతుండడంతో అడ్డుగోడ కూడా పెంచుతూపోయారట మా తాతలు.

నా చిన్నప్పుడే మా నాయినమ్మ కన్ను మూయడంతో చినతాతయ్య భార్య అదేలెండి మా చిన్నాయనమ్మ అంటే నాకు కాస్త అభిమానం ఎక్కువ. కాకపోతే ఆవిడ నోరెప్పుడూ ఖాళీగా వుండదు. ఎవరి గురించో ఒకరి గురించి వాగుతూనే వుంటుంది. ఏ ఇద్దరి మధ్య సఖ్యత వున్నా ఈవిడకు అస్సలు గిట్టదు. అందుకే నేను ముద్దుగా 'నారదాముణి' అని పిలుస్తుంటా. ఆ మాటకు నన్ను తిట్టకపోగా ''చాల్లేవే బడాయి అంటుంది'' బహుశా తనని పొగుడుతున్నాననుకుని మురిసిపోతుంటుందనుకుంటా! ఈవిడ గురించి ఎవరితోనైనా చెప్పేటప్పుడు మాత్రం మా పక్కింటి ముసల్ది అనే చెబుతుంటా...

మా పెద్దమ్మ మాత్రం ఈ ముసల్ది ''బర్రెను తన్నమంటుంది... దూడను చీకమంటుంది తక్కువది కాదు'' అంటూ తన అక్కసును వెళ్లగక్కుతుంటుంది. ఎందుకంటే ఒకసారి మా అమ్మ విషయాలు పెద్దమ్మతో, పెద్దమ్మ విషయాలు అమ్మతో చెప్పి పెద్ద గొడవయ్యేలా చేసింది మరి. పెదనాన్న కల్పించుకోవడంతో తోడికోడళ్ల మధ్య గొడవ కొద్దిలో తప్పింది గానీ.... లేకపోతేనా అప్పటికప్పుడు వేరుపడేవారే....

ఈమధ్య ముసల్ది పెట్టే కొండీల సంఖ్య ఎక్కువై ఉంటుంది. వూళ్లో వాళ్లు తల్లిపై ఇచ్చే ఫిర్యాదుల ధాటికి తట్టుకోలేక కొడుకు గట్టిగానే వార్నింగ్ ఇస్తున్నాడు.

స్టోరీ కాస్త ఇంట్రస్టింగ్‌గా అనిపించడంతో అడ్డగోడమీద కూర్చొని పక్కింట్లోకి తొంగి చూశా.

''అదేంట్రా అలా అంటావు! నేనేమైనా నీకు లాగా రచ్చబండ దగ్గర చేరి తగువులు తెస్తున్నాననుకుంటున్నావా! ఏదో మంచీ చెడ్డా నాకు తెల్సింది నలుగురికి చెబుతుంటా! దానికి కూడా తప్పేనా! అయినా నిన్ననడం కాదు ఇదిగో ఈ మహాతల్లి నీ పెళ్లాం వుందే ఇది నూరిపోస్తుంది నీకు, దీనికసలు నేనీ ఇంట్లో వుండడమే ఇష్టంలేదు. పెత్తనం చెలాయించాలని చూస్తుంది... పెత్తనం..''

నోరంతా సాగదీస్తూ.... చేతులను అటూ ఇటూ తిప్పుతూ అంటోంది ముసల్ది.

''మధ్యలో నన్నెందుకు లాగుతారు. ఒకరి విషయాలు మరొకరికి చెప్పడం మా ఇంటావంటా లేదు'' ఆవేశంగా అంది కోడలు.

''అంటే మా ఇంట్లో వాళ్లంతా అడ్డమయినోళ్లు మీరేమో పత్తిత్తులూనా...'' అంతే ధాటిగా అంది ముసల్ది.

ఇక అంతే తల్లీ కొడుకుల సంవాదం అటుంచి అత్తాకోడళ్లు యుద్ధానికి దిగారు.

అక్కడుండడం తనకంత క్షేమం కాదనుకొని కొడుకు దొడ్డిదోవ గుండానే బయటికెళ్లిపోయాడు. కోడలు వంటింట్లోకెళ్లింది సణుక్కుం టూనే....

'నీ ముందు అందరూ బలాదూరేనే ముసలీ!' అనుకున్నాను.

* * *

డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న నేను చదువు కోసం అప్పెన్‌డౌన్ చేస్తుంటాను.



మా వూరికి టౌనుకి పాతిక కిలోమీటర్లయినా దూరం ఉంటుంది.

ఎప్పటిలాగే కాలేజీ నుంచి వస్తున్న నాకు మా ఇంటి అరుగుమీద ఓ రసవత్తర దృశ్యం కనిపించింది. మా పెద్దమ్మ, ముసల్ది, ఎదురింట్లో ఉండే సుగుణమ్మ, బాయికాడోళ్ల నీలమ్మ, దిడ్డికాడి యశోదమ్మ చేరి కబుర్లాడుకుంటున్నారు ఎవరి పనివారు చేసుకుంటూనే.

మా ముసల్ది మాత్రం చేతుల్ని అదేపనిగా తిప్పుతూ ఏదో వాగుతోంది. చేతులు తిప్పందే ఒక్కమాటా బయటకి రాదు కదా ఈ ముసల్దానికి అనుకుంటూనే వారి వద్దకు చేరుకున్నాను.

''అవునవును...'' అంటూనే జొన్నల్ని బాగుచేస్తుంది మా ఎదురింట్లో వుండే సుగుణమ్మ. వరుసకి నాకు అత్త అవుతుంది. నాకెందుకో గానీ మొదటి నుంచీ ఈ వరుసలు గిరసలు పెట్టి పిలవాలంటే మా చెడ్డ చిరాకు. మా ఇంట్లో వాళ్లను తప్ప దాదాపుగా చాలామందిని పేరుపెట్టే పిలుస్తుంటాను. అది వాళ్లముందు కాదనుకోండి. ఊరు అన్నప్పుడు తప్పదు కదా! అదే పట్నం అయితే మిసెస్ సుబ్బారావో, మిస్టర్ సుబ్బారావో అని పిలవచ్చు. ఇక్కడ చచ్చినట్టు వరుసలు పెట్టి పిలవాల్సిందే! లేకపోతే 'ఎంత టెక్కు చూడు ఆ పిల్లకు' అనుకుంటారు.

దిడ్డికాడి యశోదమ్మ పెద్దమ్మ తల్లో పేలు చూస్తోంది.

బొబ్బరికాయలు తింటూనే పెద్దమ్మ ఏదో మాట్లాడుతోంది. ఊరెనకాల ఉండే కాపుపుష్పమ్మ సజ్జగింజలను గిర్నీ పట్టించుకోవడానికి వెళుతూ వీరి మాటలను వింటూ ఆగిపోయింది. ఈ సన్నివేశాన్ని చూసిన నాకు ఆ చర్చ ఎవరికి సంబంధించిందో తెల్సుకోవాలనే ఉత్సుకత ఎక్కువై ఇంట్లోకైనా వెళ్లకుండా నేనూ ఆ గ్రూప్‌లో చేరిపోయా. ఈ సమావేశంలో అమ్మలేదు. బహుశా బాయిదగ్గరికెళ్లిందేమో! ఉంటే నన్నిక్కడ అస్సలు కూర్చోనిచ్చేదికాదు. పెద్దోళ్ల విషయాలు నీకెందుకు? చదువుకోపో! అని ఇంట్లోకి తరిమేస్తుంది.

''ఏం కాపురం చేస్తుందే అది! పనిమాలా పెళ్లి చేస్తున్నారు'' అంటూ మొదలెట్టింది ముసల్ది ఎవరెవరు ఏమంటారో చూద్దామని.

అదేమీ తెలియని నేను ''ఎవరికి పెళ్లి!'' అన్నాను మా ముసల్దాని మీద చేతులేసి ఉత్సాహంగా కూర్చుంటూ...

''ఆ తిక్కపిల్ల లేదూ దానికే...'' అంది పెద్దమ్మ.

''ఏంటీ...! తిక్కపిల్లకు పెళ్లా... '' ఆశ్చర్యంగా అన్నాను. కుంటకాడి పద్మమ్మ మనమరాలికి మాట సరిగా రాదు, చెవిటి మేళం, ఏ పనీ సరిగా చేయరాదు. కోపమొస్తే చాలు ఎవరిమీదికి బడితే వారిమీదకు చేతిలో ఏదుంటే అది విసిరి కొడుతుంది. అందుకే ఊరంతా ఆ పిల్ల అసలు పేరు మర్చిపోయి తిక్కపిల్ల అని నామకరణం చేశారు. తల్లిదండ్రి చిన్నప్పుడే చనిపోవడంతో ఆ పిల్లను నాయినమ్మే పెంచుతుంది.

''అనుకున్నదే కదా! మేనబావకిచ్చే చేస్తున్నారు'' అంతకుక్రితమే అన్నం తిన్నట్టుంది మా పక్కింటి చిన్నమ్మ పళ్ల సందుల్లో పుల్లకెలుకుతూ అంది.

''ఎవరు! ఆ మెల్లకన్ను పిల్లాడేనా! పెళ్లికి ఒప్పుకోలేదని ఇన్నాళ్లూ అన్నారు కదా!'' పెద్దమ్మ ఒళ్లో వున్న బొబ్బరికాయలను తీసుకుంటూ ఆసక్తిగా అడిగాను.

''ఏముందీ...! ఆ పిల్ల పేరన నాలుగెకరాల బత్తాయి తోటవుందిగా. దాన్ని వాడి పేరన రాస్తామన్నారట ఇక ఒప్పుకోక ఏం జేస్తడు'' అంది పెద్దమ్మ జుట్టును ముడేసుకుంటూ.

''ఏంటీ ఆ పిల్లను చేసుకోవాలంటే బత్తాయి తోట మొత్తం రాసివ్వాలా...! ఆశ్యర్యంగా అన్నాను.

''ఏ లోపమూ లేని పిల్లలకే లక్షలు లక్షలు పోయంది పెళ్లిళ్లు కావడంలేదు. అందులో ఓ మాట సరిగా రాదు పైగా చెవిటి మేళం ఎవరు చేసుకుంటారు మరీ!'' దిడ్డికాడి యశోదమ్మ రాగం తీస్తూ అంది.

''మరి బత్తాయి తోట రాసిస్తే ఆ పిల్లకున్న అవలక్షణాలన్నీ తీరిపోతాయేంటి!'' బొబ్బరి గింజలను నోట్లో వేసుకుంటూ అన్నా.

''అయినా మరో పెళ్లి చేసుకుంటాడంటలే!'' ఎదురింటి సుగుణమ్మ గుసగుసగా అంది.

''మరి ఈ పిల్లనెందుకిచ్చి చేస్తున్నారు!'' అంతే గుసగుసగా నేనూ అడిగా.

''ఏదో పెళ్లయి ఆ పిల్లకడుపునో నలుసు పడితే దాని బతుక్కో తోడుంటుందనుకుంటోంది ఆ పిల్ల నాయినమ్మ!'' అంది మా ముసల్ది.

''మరి పెళ్లయిన మర్నాడే తన్ని తరిమేస్తే ఆ పిల్ల గతేంటి! అయినా ఆ పద్మమ్మని ఎప్పుడు కదిలించినా చేతిలో చిల్లి గవ్వలేదన్నట్టుగా మాట్లాడుతుంది. మరిప్పుడింత ఖర్చుపెట్టి పెళ్లెలా చేస్తుందట. ఉన్నదంతా కూతురికి ఊడ్చిపెట్టి ఆ పిల్లను అనాధను చేయాలనుకుంటోందా ఏంటి? ఆ పిల్లకున్న ఒక్క ఆధారమూ పోతే ఎవరి పంచనో పడి వుండాల్సిన కర్మ పట్టదా'' ఆవేశంగానే అన్నా.

ఎక్కడ్నించి వచ్చిందో అమ్మ ''నీకెందుకే ఇయన్నీ...! ఇంట్లకు పో... పెద్ద పెద్ద విషయాలు కావాలి నీకు'' అంది ఎప్పటిలాగే.

''అదికాదమ్మా...!'' అంటూ సర్దిచెప్పబోయా!

''నోర్మూసుకో... ఎవరి తిప్పలు వాళ్లు పడతారు మధ్యన నీకెందుకు'' అంది.

అంతే బొబ్బరికాయల్ని పెద్దమ్మ ఒళ్లోకి విసిరేసి కోపంగా లోపలికి వెళ్లిపోయాను.

''మనకెందుకులే... ఎవరెట్టాబోతే...'' నిట్టూరుస్తూ అంటున్న ఎదురింటి సుగణమ్మ మాటలు వినబడ్డాయి.

ఇంతలో నాన్న ఎవరో ఇద్దరు వ్యక్తులతో మాట్లాడుతూ రావడం చూసి ఎవరిళ్లకు వాళ్లు గమ్మున వెళ్లిపోయారు.

* * *

మరుసటి రోజు తెల్సింది అమ్మ ఎందుకు నా నోరు మూయించే ప్రయత్నం చేసిందో. మా ముసల్ది ఎప్పుడు అంటించిందో తెలియదు గానీ ఆ తిక్కపిల్ల నాయినమ్మకు నేనన్న విషయం కాస్త చేరవేసింది.

సరాసరి ఆ తిక్కపిల్ల నాయినమ్మ మా ఇంటి కొచ్చి ''ఏవమ్మా! శాంతమ్మా ఇదేనా పిల్లల్ని పెంచే తరీక! నీ బిడ్డ అట్టా ఎంత మాటైతే అంత మాటనొచ్చా... లేకపోతే సదువుకున్నదాన్నని టెక్కా...... అయినా మేం ఏట్లో కలుస్తాం... మీకెందుకు'' నిష్టూరంగా అంటోంది అమ్మతో.

ఇదేంటి ఉరుములేని పిడుగులా అనుకుంటూనే



## నులి పురుగుల నివారణకు...

సరైన శుభ్రత పాటించని కారణంగా కడుపులో నులిపురుగులు ఏర్పడతాయి. వీటి మూలంగా ఆకలిలేకపోవడం, కడుపునొప్పి తదితర కారణాలతో బాధపడాల్సి వస్తుంది. ఈ సమస్య చిన్న పిల్లల్లో ఎక్కువగా కనిపిస్తుంటుంది. కడుపులో నులిపురుగులు నశించడానికి ఆహారపదార్థాలు, వ్యక్తిగత శుభ్రత పాటించడం తప్పనిసరి. దీంతోపాటుగా నులిపురుగులతో బాధపడుతున్న వ్యక్తులకు ఈ కింది ఔషధాల్ని తయారు చేసి తాగిస్తే గుణం కన్పిస్తుంది.

* వేపు పువ్వును నూరి బొడ్డు దిగువ భాగాన పట్టీవేస్తే కడుపులోని నులిపురుగులు చని పోతాయి.

* బెల్లం, నల్లజీడి మెత్తగా నూరి రాత్రి పడుకునే ముందు గోధుమ గింజంత మాత్ర తీసుకుంటే నులిపురుగులు చనిపోతాయి.

* మామిడిటెంకలోని జీడి చూర్ణం సేవించినా నులిపురుగులు ఏర్పడవు.

* వేడినీటిలో కొంచెం ఆముదం కలిపి తాగితే మలం ద్వారా నులిపురుగులు పోతాయి.

* శొంఠి, పిప్పళ్లు, మిరియాలు, కరక్కాయలు, తాడికాయ, ఉసిరిక పప్పు కలిపి తులం మోతాదు చూర్ణం చేసి వేడి నీటితో రాత్రిళ్లు తాగించాలి.

* ముసాంబరంను అరటిపండులో పెట్టి తింటే నులిపురుగులు ఏర్పడవు.

* కురంజి వామును నీళ్లతో నూరి మాత్రలు చేసి బియ్యపు పిండిలో కలిపి ఉదయం పరగడుపున తింటే నులిపురుగులు చచ్చిపోతాయి.

''ఏమైంది!'' అన్నాను ఆవిడేం అంటోందో తెలియక.

''నిన్న మా బుజ్జి గురించి ఏమో అన్నావట! మా తిప్పలేవో మేం పడ్తాం... నీవేమైనా ఆర్చే దానివా! తీర్చేదానివా!'' అంటూ గయ్యిమంది.

''ఎవరు చెప్పారు ఆ ముసల్దేనా!'' కోపంగానే అన్నా.

''ఎవరు చెబితే ఏం లే! కాస్త నోటిని అదుపులో బెట్టుకో... పెళ్లికావల్సిన పిల్లవి. నోటికెంత మాటొస్తే అంత మాట అనేయడమేనా! అంది.

''నేనేమన్నాననీ! ఉన్నదంతా మనవడికి రాసిస్తే నీ మనవరాలి పరిస్థితేంటి? అన్నా. అది కూడా తప్పేనా''

''ఏమీ తప్పుకాదు. మీ అయ్య ఇన్నన్ని పైసలు పోసి సదు సెప్పిస్తున్నాడు కదా! పైసలియ్యకుండా నీ పెండ్లి ఎట్లా అవుతుందో చూస్తా! ఇన్నాళ్లూ ఫలానోళ్ల పిల్ల ఎంత సదుకున్నా పెద్దలను చాలా గౌరవంగా చూస్తదని నలుగురికి చెప్పేదాన్ని. కానీ నాకిప్పుడే తెల్సింది నీకింత టెక్కుందని... అంటూ విసవిసా వెళ్లిపోయింది.

అమ్మయితే అలాగే నిల్చుండిపోయింది ఏం మాట్లాడో తెలియక. ఆవిడ వెళ్లిపోయాక మాత్రం ''నే చెబితే విన్నావా! ఆ ముసల్దాని ముందు ఏం వాగకే అనేది ఇందుకే... పుల్లొకటి అంటించి ఇల్లెలా కాలుతుందో చూసే రకం ఆ ముసల్ది.... ఇప్పుడు చూడు ఏమైందో...'' అంటూ అమ్మ కూడా విసురుగా వెళ్లిపోయింది.

'ఒసేయ్! ముసలీ.... ఎంత పనిచేశావే... నాతో తీయగా మాట్లాడుతూనే ఆ పద్మమ్మ చేత నన్నిన్ని మాటలనేలా చేస్తావా! చూస్తా... ఇక నుంచి నువ్వెరితో వాగుతావో.... ఎక్కడెక్కడ తిరుగుతావో.... ఇంట్లో ఓ మూలన పడేలా చేయకపోతే... నా పేరు మార్చేసుకుంటా...' మనసులోనే శపథం చేసుకున్నా.

మనసులో అనుకున్న మాట మరో రెండు రోజుల్లోనే నెరవేరుతుందని కలలో కూడా అనుకోలేదు.

* * *

ఈ ముసల్దాన్ని ఏం చేయాలా! అని ఆలోచిస్తున్న నాకు మెరుపులాంటి ఆలోచన తట్టింది. అంతే దాన్ని అమల్లోపెట్టేశా...

నాకు బుద్ధి పుట్టినప్పుడల్లా వంటలపై ప్రయోగాలు చేసి తలాకొంచెం పెట్టి మెచ్చుకోలు కొట్టేస్తుంటాను. ఆ వంటకాలు మా యింట్లోవాళ్లకే కాకుండా పక్కింటికి కూడా చేరుతుంటాయి. ముఖ్యంగా ముసల్ది మెచ్చుకొని బాగానే లాగిస్తుంటది, మా బుజ్జి వంట చాలా బాగాచేస్తదంటూ.

కాలేజీ నుంచి వచ్చేప్పుడు అరడజను అరటి పండ్లు కొనుక్కొచ్చా, అలాగే బాయిదగ్గరికెళ్లి దురదగొంటాకు రసం జాగ్రత్తగా చేతులకు తగలకుండా తీసి చిన్న టానిక్ బాటిల్నిండా నింపుకొచ్చా. అరటిపండు గుజ్జును పాలలో కలిపి మిల్క్ షేక్ అని పేరుపెట్టేశా. ఇప్పుడిక దురదగొంటాకు ఈ మిల్క్షేక్లో కలిపి ముసల్దాన్ని ఇన్వైట్ చేయాలని నా ప్లాను. సరంజామా అంతా సిద్ధం చేసుకొని దర్వాజ బయటికెళ్లి చూశా ముసల్దాని కోసం.

'ఎప్పుడూ చాటంత నోరేసుకుని వచ్చే ముసల్ది రెండ్రోజులుగా కనపడడం లేదు. ఏమై వుంటుం దబ్బా...' రెండు చేతులను ముందుకు వెనక్కి ఊపుతూ ఆలోచిస్తున్నా.

ఇంతలో పచ్చిగడ్డి తీసుకొచ్చి పెద్దర్వాజ ముందున్న ఆవుదూడకు వేస్తోంది ముసల్ది. బహుశా ఎవరింటి ముందు దూడ దగ్గర కొట్టుకొచ్చిందో...

దగ్గరకెళ్లి ఆప్యాయతంతా ఒలకబోస్తూ ''నాయినమ్మా.... ఏం చేస్తున్నావూ....'' గారంగా అడిగా.

''దూడకు మేతేస్తున్నానే... నేను కాస్త పట్టించుకోకపోతే చాలు ఇల్లు వల్లకాడవుతుందనుకో... యాల్లకింత తింటారు గని దేని గురంచయినా పట్టించుకోవడం ఉందా అసలు... అందరికీ ఇంత అదురుష్టం రాసిపెట్టివుండదే తల్లీ.... ''

కోడల్ని ఉద్దేశించే అంటోందని అర్థమైంది.

''అది సరే గానీ, రెండ్రోజులుగా నీ దర్శనమే లేదు.... ఎక్కడికెళ్లావు.''

''ఒంట్లో కాస్త బాలేదే''

''ఏమయిందేంటి?''

''నిన్న పొద్దున గారెలు తిన్నానే... పడ్డట్టు లేదు ఒంటికి, ఒహటే కడుపునొప్పనుకో...'' ఓ చేత్తో పందిరిగుంజను పట్టుకుంటూ అంది.

''అవునుమరి కుంభకర్ణుడి పెద్ద చెల్లెల్లాగా మేసేస్తే ఇలాగే వుంటుంది.''

''అమ్మతోడే రెండే తిన్నా!'' అంది.

అసలు విషయంలోకి వద్దామని ''నాయినమ్మా... నీ కోసమని మిల్క్ షేక్ చేసా! రా తాగుదువుగానీ, కడుపునొప్పి, గిడుపునొప్పి అన్నీ క్షణంలో పోతాయి.

''ఏం షోకూ...''

''అబ్బ షోకు కాదే! మిల్క్ షేక్'' అన్నాను గట్టిగా రెండుసార్లు.

''ఏం షేకో ఇప్పుడవన్నీ వద్దే'' గనవట్లో కూలబడుతూ అంది.

''అది గనక తాగావనుకో నీ కడుపులోని గడబిడ తగ్గుతుంది. నీరసం పోయి ఉత్సాహం వస్తుంది'' అన్నాను.

''నిజంగా తగ్గుతుందంటావా....'' అనుమానంగా అంది.

''నిజ్జం.... నీతోడు...'' అన్నాను నమ్మకంగా.

''సరే... దూడకు నీళ్లుపెట్టి వస్తాలే'' అంటూ లేచింది.

హమ్మయ్య! అది చాలు నాకు వస్తానంది కదా! ''త్వరగా రా'' అంటూ ఇంట్లోకి పరిగెత్తా. గ్లాసులో ఎవరికీ తెలియకుండా ఆ ఆకుపసరు కలపాలి కదా!

బాటిల్ మూత తీసి గ్లాసులో పోసి స్పూన్తో కలిపేశా..... ఈ రోజుతో ముసల్దాని పని ఢమాల్.... అనుకుంటుండగానే

''అమ్మోయ్..... '' అంటూ గావుకేక ఆ వెంటనే 'ధడాల్'మనే పెద్ద శబ్దం వినిపించింది.

అఘాట్న వసారాలోకి వచ్చి చూద్దును కదా! ముసల్ది చూసుకోకుండా పేడ మీద కాలేసినట్టుంది. జారి పెద్దర్వాజకు అడ్డంగా పడిపోయింది.

పగటేల కునుకుతీస్తున్న అమ్మ ఏమయిందంటూ కంగారుగా లేచొచ్చింది. ఇంటెనకాల ఎడ్లకు నాడాలు కొట్టిస్తున్న నాన్న, చిన్నాన్న ముసల్దాని గావుకేకకు భయపడి పరిగెత్తుకుంటూ వచ్చారు.



## ఇలా చేస్తే జ్వరం తగ్గిపోతుంది

జ్వరం తగ్గడానికి క్రోసిన్ మాత్ర వేసుకుంటే సరిపోతుంది అనుకున్నా ఒక్కోసారి తగ్గుతూ, పెరుగుతూ వచ్చే జ్వరం ప్రమాదికారి అయ్యే అవకాశం ఎక్కువ. జ్వరం తగ్గడానికి పత్యం, కషాయాలు సేవించడం చూస్తూనే వుంటాం. ఈ కింది దినుసులను, పత్రిలను ఉపయోగించి కషాయం, మాత్రలు తయారు చేసుకొని సేవించండి.

*గోరింటాకు రసం రెండు లేక మూడు తులాలు అంతే పాలలో కలిపి తాగితే చలి జ్వరం తగ్గుతుంది.

* పుచ్చకాయ గింజలను కషాయముగా కాచి తాగితే జ్వరం తగ్గుతుంది.

* సంపెంగ చెట్టు బెరడును మిరియాలతో నూరి మాత్రలు చేసి ఉదయం, సాయంత్రం ఆ మాత్రలను వేసుకుంటే చలిజ్వరం తగ్గుతుంది.

* మిరియాలను చూర్ణం చేసి తులసి ఆకు రసంలో తడిపి నీడన ఆరబెట్టాలి. ఆరిన చూర్ణాన్ని తిరిగి తులసి ఆకు రసంతో తడిపి నీడన ఆరబెట్టాలి. ఈ విధంగా ఏడుసార్లు తడిపి నీడన ఆరబెట్టిన చూర్ణాన్ని శనగగింజంత మాత్రలు చేయాలి. ఈ మాత్రలను రోజుకు రెండు సార్లు తీసుకుంటే ఎలాంటి జ్వరమైనా మూడురోజులలో తగ్గిపోతుంది.

* చేదు జీలకర్ర చూర్ణంను నేతిలో కలిపి తాగితే చలి జ్వరం తగ్గుతుంది.

* ఏడుతులసి ఆకులు, ఏడు మిరియపు గింజలను నీటితో నూరి ఉదయం పరగడపున తాగితే అన్ని రకాల జ్వరాలు తగ్గిపోతాయి.

''ఏం పనే ఇది ఈ వయసులో ఓ మూలన కూసోక.... ఎందుకీ అర్వాటం.... అంటూ ముసల్దాన్ని లేవనెత్తి మంచంలో పడుకోబెట్టారు. పాపం ముసల్ది కూచోలేకపోతోంది, నించోలేకపోతోంది. కుడికాలు కొద్దిగా కదిపినా నొప్పితో విలవిలలాడిపోతోంది. నోరు ఏరాయికైనా గుద్దుకుందో ఏమో నోట్లోనుంచి రక్తం కారుతోంది. పెద్దమ్మ, పెదనాన్న, ముసల్దాని కోడలు, చుట్టుపక్కల ఇండ్లలోని అయిదారుగురు అమ్మలక్కలు వచ్చి ఎవరికి తోచిన మాట వారంటున్నారు. అందులో ఒకరు గొల్ల సైదులును పిల్చుకురావడానికి వెళ్లారు. మావూళ్లో గొడ్డుకైనా, మనిషికైనా మొదటవైద్యం చేసేది గొల్లసైదులే. నాటు వైద్యం చేయడంలో అతనికి అతనే సాటి. తొంబై ఏళ్లున్నా ఇంకా గట్టిగానే వున్నాడు.

కాళ్లూ చేతులు పరీక్షగా చూసిన సైదులు ''దొరా... కుడికాలు బుసబుస పొంగి ఇంత లావయింది సూడుండ్రి కాలిరిగినట్టే వుంది. ఈ వయసులో కాలిరిగితే కట్టుకోవడం చానా కష్టం.'' అంటూనే నోట్లోంచి రక్తం కారుతుండడం చూసి గట్టిగా నోరు తెరిచి నీళ్లు తెప్పించి కడిగాడు. ''అయ్యోదొరా... రెండు పండ్లూ నాలికలో దిగబడ్డయ్ం.... తొరగా టవునుకు తీసుకుపోండ్రి... లేకపోతే శానా పెమాదం'' అన్నాడు.

అప్పటికప్పుడు ఎడ్లను తోలుకొచ్చి బండికట్టి ముసల్దాన్ని టవునుకు తీసుకుపోయిండ్రు.

* * *

నాలుగు రోజులు తర్వాత ఇంతలావు బాండేజీ వేసున్న కాలుతో బండిమీంచి దింపారు ముసల్దాన్ని.

దగ్గరికెళ్లి ''నాయినమ్మా.... ఎలా వుంది....'' బాధగా అడిగా. ఎంతైనా ముసల్ది కదా పాపం అనిపించింది.

తలనోసారి పైకెత్తి చేతిని గాల్లో తిప్పి నుదిటిమీద అడ్డంగా గీసుకుని నిట్టూర్చింది.

బహుశా తలరాతని తిట్టుకుంటుందనుకుంటా.

పాపం మాట్లాడడానికి నోరు రావడం లేదు. మరి నాలుకకు నాలుగు కుట్లు పడ్డాయట ఇంకేం మాట్లాడుతుంది.

ముసల్దాని సైగలతో రెండు నెలలు భారంగా గడిచిపోయాయి.

* * *

డిగ్రీ ఎగ్జామ్స్ అయిపోవడంతో పిజి ఎంట్రన్స్ కోసం పట్నంలో ఉన్న అక్క దగ్గరికెళ్లా. కాలేజీలో సీటు సంపాదించుకుని పనులన్నీ చక్కదిద్దుకునే సరికి మావూరికి, నాకు అయిదారునెల్ల గ్యాప్ వచ్చేసింది. ముసల్దాని బాగోగుల గురించి తెలపమని ఓ సారి నాన్నకు ఉత్తరం రాశా. 'బాగానే ఉంది కట్టెపట్టుకొని తిరుగుతోంది' అని తిరుగు ఉత్తరం రాశాడు నాన్న.

దసరా హాలిడేస్ ఇచ్చేసరికి పండుగకు పదిరోజుల ముందుగానే ఊరికొచ్చేశా!

బస్సు దిగుతూ ఇంటిదారిపట్టిన నేను

''హాయ్ సిస్టర్' అన్న పిలుపుకి వెనక్కి తిరిగి చూశా! కుంటకాడి రాధమ్మ కొడుకు పదేళ్ల సుధీర్ పశువులను మేతకు తోల్కపోతూ కనిపించాడు.

వెనక్కి తిరిగి ''ఒరేయ్ మీ అమ్మా నాయిన నిన్ను స్కూల్ పంపించడం లేదు కదా! నీవెళ్లేదేమో పశువుల కాడికి... ఇంగ్లీషెప్పుడు నేర్చుకున్నావు'' ఆశ్చర్యంగా అడిగా.

వాడో నవ్వు నవ్వేసి పశువులనదిలిస్తూ 'డుం... డుం... డిగా డిగా' అంటూ వెళ్లిపోయాడు.

'ఎంటో... వీడికేమైనా పిచ్చిగానీ పట్టలేదు కదా'' నాలో నేను అనుకుంటూ ఇంటికెళ్లా.

కాళ్లూ చేతులు కడుక్కుని గ్లాసుడు మంచినీళ్లు తాగా. ఎప్పుడెప్పుడు ముసల్దాన్ని చూద్దామాని వుంది.

'ముసల్దానికి పూర్తిగా బాగయిపోయి ఊరువాడా తిరిగేస్తూ వుండింటుంది. ఆలిండియా రేడియోలాంటి ముసల్దాని దగ్గర విశేషాలు తెల్సుకోవాలనే ఉత్సాహంతో పక్కింటి కెళ్లా.

**పాపం ముసల్ది... దురదగొంటాకు రసంతో ఓమూలన పడేద్దామని నేను అనుకుంటే... ఈ కేబుల్ వైరొచ్చి ఈ ముసల్దాన్ని కట్టగట్టి ఈ రోటిమీదికి యిసిరేసిందన్నమాట. నేను చేయలేని పని టీవి చేసినందుకు సంతోషించాలో... వూర్లో అమ్మలక్కలందరూ మాటామంతీ లేకుండా కళ్లు దురదపెట్టేదాక టివిలు చూస్తున్నందుకు బాధ పడాలో అర్థంగాలె.**

''నాయినమ్మా....'' అంటూ ఎప్పటిలాగే పిలుచుకుంటూ లోపలికి అడుగుపెట్టా! ఎదురుగా చిన్నమ్మ టి.విలో ఏదో సీరియల్ చూస్తోంది. 'నేను వెళ్లేప్పుడు వీళ్లింట్లో టివిలేదే... బహుశా ఈ మధ్యనే తెచ్చుంటారు అనుకుంటూ... ''చిన్నమ్మా... బాగున్నావా... నాయినమ్మ ఎక్కడా...'' అడిగా. అడిగినదానికి సమాధానం లేదు సరికదా కనీసం కళ్లయినా తిప్పిచూడలేదు. అంతగా లీనమైపోయింది టి.వి చూడడంలో.

'సరేలే... ఏం చేస్తాం! అనుకుంటూ దిడ్డి గుమ్మంవైపు వెళ్లా... నోటమాట రాలేదు మా ముసల్దాన్ని చూసి.

గుమ్మం బైట వున్న రోలుపై ధీర్ఘంగా ఆలోచిస్తూ దిగులుగా కూర్చుంది. చేతిలోని కర్రకు మొహం అనుపెట్టి.

''నాయినమ్మా... '' అంటూ భుజంపై చేయేసా!

అంతే ఉలిక్కిపడి కళ్లు తెరిచింది ''ఎవరూ...'' అంటూ.

నన్ను చూసి ఆనందంగా ''నువ్వానే బుజ్జీ బాగున్నావా'' అంటూ కళ్లనీళ్లు పెట్టుకుంది.

''ఏమయింది నాయినమ్మా.... ఇంకా నొప్పి తగ్గలేదా''

''నొప్పి లేదు ఏం లేదు'' అంది ముక్కు ఎగబీలుస్తూ

''మరేమయిందీ... ఊరంతా ఇంత ప్రశాంతంగా ఉంది. బయటెవరూ కనబడడం లేదు. మాట్లాడేవారే కరువయ్యారు. ఏమైనా విశేషాలు చెబుతావేమోనని నేనొస్తే నువ్వేమో కళ్లనీళ్లు పెట్టుకుంటున్నావు... ఏమయిందే'' అనునయంగా అడిగా

''ఏముందే ఊరంతా వల్లకాడయింది. అగో ఆ కలర్‌డబ్బా వచ్చినాక నాకే కాదే ఊరందరి నోరూ పడిపోయింది. ఇంటికో టివి. అందులో అవేవో సీరియళ్లంట. నా ముచ్చట్లకన్నా అవే బాగుంటయంట. ఎవరూ నాతో మాట్లాడడం లేదు. అందరూ ఆ బొమ్మల పెట్టెకేసి కళ్లప్పగించి రాత్రింబవళ్లూ చూసుకుంటా కుసుంటున్నారు. ఓ మాటా లేదు మంతీ లేదనుకో...'' చీర చెంగుతో కళ్లు, ముక్కు తుడుచుకుంటూ ''అయిద్నెళ్ల తర్వాత ఇగో ఇప్పుడే మాట్లాడుతున్నా...'' ఆవేదనగా అంది ముసల్ది.

''అదేంటి అందరూ అట్టా టివీల కేసి చూస్తూ కూర్చుంటే నువ్వేం చేస్తున్నావు.... ఏదో విధంగా మాటలు కలపడంలో నీవు చాలా దిట్టకదా!''

'' ఆఁ... నువ్వట్టా అంటావు ... అగో ఆ రాక్షసి ఉందే. టీవి చూస్తుంది నాకోడలు. పొద్దస్తమానం దాని ముందే తగలడ్తుందని ఆ మధ్య చేతికర్ర తీసుకొని టీవికేసి కొట్టబోయా.... అంతే శివంగిలా లేచి 'నన్నేమైనా అను... అంతే గాని టీవి మీద ఈగవాలిందంటే నీ పీకపిసికుతా... అన్నంత పనిచేసిందే.. ఇది చూసిన నా కొడకు ఒక్క మాటన్నా నా వైపు మాట్లాడలేదే'' చెంగుతో మళ్లీ కళ్లొత్తుకుంటూ అంది.

''ఇగ ఇంట్లోనే ఇట్టావుంటే పరాయి ఇండ్లల్ల ఏమైనా అంటే నన్ను కొట్టరానే... ఈ వయసులో నలుగురిచేత తన్నులు తినమంటావా! చెప్పు... '' దిగులుగా అంది మళ్లీ.

పాపం ముసల్ది... దురదగొంటాకు రసంతో ఓమూలన పడేద్దామని నేను అనుకుంటే... ఈ కేబుల్ వైరొచ్చి ఈ ముసల్దాన్ని కట్టగట్టి ఈ రోటిమీదికి యిసిరేసిందన్నమాట. నేను చేయలేని పని టీవి చేసినందుకు సంతోషించాలో... వూర్లో అమ్మలక్కలందరూ మాటామంతీ లేకుండా కళ్లు దురదపెట్టేదాక టివిలు చూస్తున్నందుకు బాధ పడాలో అర్థంగాలె.

దీనికీ ఓ అయిడియా ఆలోచించాలని కూర్చున్నా... కానీ బుర్రనెంతగా కొట్టినా ఒక్క ఐడియా వచ్చి చావడం లేదు. ఎవరైనా దయచేసి ఐడియా చెప్పగలరా... నాకోసం కాదు పాపం మా ముసల్దానికోసం. దాని దిగులు చూళ్లేకపోతున్నా... మళ్లీ నే పట్నం వెళ్లి తిరిగొచ్చేసరికి మా ముసల్దానితో పాటు వూళ్లో అందరూ మూగోళ్లయిపోతారేమోనని నాకే దిగులుగా వుంది.